క్లుప్తంగా

కనులవిందుగా వేణుగోపాలుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి మాస కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు అర్చకబృందంచే సత్యభామ, రుక్మిణీదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆరుగురు దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, భక్తులు పాల్గొన్నారు.

కుర్చీలు, బల్లల వితరణ



గంపలగూడెం: గంపలగూడెం భజన మందిరానికి భక్తులు కుర్చీలు, బల్లలను శనివారం వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన కొల్లా వెంకట కిషోర్‌బాబు, హిమబిందు దంపతులు రూ. ఐదు వేల విలువైన 20 కుర్చీలు, పులిపాటి రాజారావు రూ.ఐదు వేల విలువైన రెండు స్టీల్ టేబుల్స్‌ను కమిటీ సభ్యులకు అందజేశారు. మండలంలోని పెనుగొలను శాఖా గ్రంథాలయానికి రాజవరం మాజీ సర్పంచ్ అబ్బూరి వెంకటయ్య టేబుల్, ఎస్‌చైర్‌ను అందజేశారు. విశాంత్ర ఎంఈఓ వి. శేషిరెడ్డి, గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత, నారాయణరావు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా నంద దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం నంద దీపోత్సవం వైభవంగా జరిగింది. బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు నంద దీపాలతో వెంటరాగా మందిరం చుట్టూ 11 ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బాబాకు విశేష పూజ, హారతి ఇచ్చారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 36 మంది ఎంపిక

నూజివీడు: పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 36 మంది ఎంపికయ్యారని దివీస్ హెచ్‌ఆర్ ప్రతినిధి కావూరి రామకృష్ణ తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో మొత్తం 66 మంది అభ్యర్థులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తోటకూర సాంబశివరావు, గొల్లపూడి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం నూతన కార్యవర్గం ఎన్నిక



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారి తోట, ఫీడర్‌రోడ్డులోని శ్రీ కోదండ రామాలయం నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. ఆలయ కమిటీ అధ్యక్షులుగా రాయి రంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా కొమిర శ్రీను, కోశాధికారిగా బత్తుల బాలయ్య, గౌరవాధ్యక్షులుగా బలగాని శ్రీను, వేముల దుర్గారావు, పగడాల వెంకటేశ్వరరెడ్డి, డబ్బుకొట్టు వెంకటేశ్వరరావు, కొప్పుల శ్రీనివాస్, కుందురు బుడ్డారెడ్డి, ఉపాధ్యక్షులుగా పసుపులేటి నీలకంఠం, పిండిమర చెన్నయ్య, సహాయ కార్యదర్శులుగా చింతలపూడి తిరుపతిరెడ్డి, గంధ్ర వెంకటేశ్వర్లు, 16 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ఆవరణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నూతన సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలను ఆర్థికంగా బలవంతులను చేసేందుకు తమ సొసైటీ ద్వారా రుణాలను అందజేస్తున్నామని పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అలమండ యల్లారావు తెలిపారు. పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ 11వ వార్షికోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా యల్లారావు మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు తాము ఈ సొసైటీని స్థాపించామన్నారు. సొసైటీ ద్వారా ఇప్పటి వరకు కోట్లాది రూపాయలను పొదుపు సంఘాలకు రుణాలుగా అందించామని తెలిపారు. భవిష్యత్‌లో లక్ష మంది మహిళలకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తమ సొసైటీలోని సభ్యులు ఖాతాలను సులువుగా స్మార్ట్ ఫోన్ ద్వారా నిర్వహించుకునే విధంగా పీపుల్స్ కనెక్ట్ పేరుతో యాప్‌ను రూపొందించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. సొసైటీ కోశాధికారి ఎ.జోత్స్న మాట్లాడుతూ.. తమ సొసైటీ ద్వారా ప్రత్యేకంగా మహిళల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. సభ్యులు సి.అరుణ్ కుమార్, జీవీ సాంబశివరావుతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ



సబ్ జైలును సందర్శించి వివరాలు నమోదు చేసుకుంటున్న జడ్జి కె.శివపార్వతి

- 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ
- 29న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: క్షణికావేశంలో చేసిన చిన్న చిన్న తప్పుల వల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారుల కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. స్థానిక 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పోలీసు అధికారులతో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 29న కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని చెప్పారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుకు అప్పీలు ఉండదని, కక్షిదారులు లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకుంటే తమ విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, వివాహ సంబంధ కేసులు, వాహన ప్రమాద కేసులు, పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.హరికృష్ణ, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శివపార్వతి, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, అడిషినల్ పీపీ జేడీ గాంధీ, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలలో మార్పు రావాలి

నూజివీడు: కొందరు క్షణికావేశంలోనూ, మరి కొందరు అనుకోకుండా చేసిన నేరాల వల్ల జైలు జీవితం గడపాల్సి వస్తుందని, దీనిని గుణపాఠంగా తీసుకొని జీవితంలో తప్పులు చేయకుండా జీవనం సాగించాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శివపార్వతి అన్నారు. పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం సందర్శించిన ఆమె ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను, జైలు పరిసరాలను, వంటశాలను పరిశీలించారు. అనంతరం రిమాండ్ ఖైదీలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనివారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. అలాంటి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగించాల్సిన మీరందరూ ఇలా జైలులో జీవితం గడపాల్సి రావడంపై ఆలోచించుకోవాలని చెప్పారు. మార్పు రావాలని, అప్పుడే జీవితం సక్రమంగా సాగుతుందన్నారు. జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. బెయిల్ మంజూరై జామీను దారులు లేక సబ్ జైలులోనే ఉన్న రిమాండ్ ఖైదీల వివరాలను నమోదు చేసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఎ.కొండూరు: ఉపాధి హామీ కూలీలు మే నెలలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, జిల్లా ఉపాధ్యక్షుడు పానెం ఆనందరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కంభంపాడు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి అక్కడ ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తమకు మే నెలలో చేసిన పనులకు సంబంధించి ఇప్పటివరకు డబ్బులు రాలేదని, కొన్ని గ్రామాల్లో వంద రోజులు పూర్తికాకుండానే పనులను ఆపేస్తున్నారని, పని ప్రదేశాల్లో తమకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని కూలీలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని, పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, కల్యాణ్, డి. కల్పన, బి. పద్మ, టి. నాగగౌరి, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

తహసీల్దార్ రాజేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

మైలవరం: విద్యార్థులు విద్యపై దృష్టి ఉంచి ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు అన్నారు. మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. శ్రీ లక్ష్మీ మహిళా మండలి ఎన్‌జీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన నాన్ రెసిడెన్షియల్ పాఠశాల అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు విద్యపైనే దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఎం. శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పరమెట్లలో విష జ్వరాలు



తాడేపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



పారిశుద్ధ్య పనులు చేపట్టిన సిబ్బంది

- గ్రామంలో 50 కేసుల నమోదు
- వైద్య శిబిరాల ఏర్పాటు

ఆగిరిపల్లి: చొప్పరమెట్ల పంచాయతీ పరిధిలోని తాడేపల్లిలో వారం రోజుల నుంచి విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. రెండు రోజులు జ్వరంగా ఉంటుందని, అది తగ్గిన వెంటనే కీళ్ల నొప్పులు వస్తున్నాయని జ్వరం బారిన పడిన బాధితులు చెబుతున్నారు. సగ్గూరు పీహెచ్‌సీ వైద్యులు మంజుల మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తిరిగి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు జ్వరాలపై సర్వే నిర్వహించారని చెప్పారు. వారం రోజుల నుంచి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారని, మురుగు కాలువల్లో దోమల మందు పిచికారీ చేశారని చెప్పారు. గ్రామంలో 50 జ్వరాల కేసులు నమోదయ్యాయన్నారు. గ్రామాల్లో తాగునీటిని పరీక్ష కోసం ఏలూరు ల్యాబ్‌కి పంపించామని వైద్యాధికారి మంజుల తెలిపారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు.

లయన్స్ క్లబ్ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆటోనగర్ జెమ్స్ అధ్యక్షుడు రవీంద్రనాథ్

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్ సేవలను జిల్లా వ్యాప్తంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా గవర్నర్ శంకరగుప్తా అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జిల్లా గవర్నర్స్ యాన్యువల్ ఆఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టిపుల్ జిల్లా చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా జిల్లాలో లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా లయన్స్ క్లబ్‌లలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఉచిత వైద్య శిబిరాలతో పాటు పలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొలుత ఎనిమిది క్లబ్‌ల ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్న అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ల్యాప్‌టాప్ అందజేత..

అనంతరం పేద విద్యార్థులకు రూ.6,500 ఆర్థిక సహాయంతో పాటు ఒక విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లుల రవీంద్రనాథ్, శ్రీనివాసరెడ్డిలతో పాటు పలువురు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలను అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. యువతకు విజ్ఞానం అందించేందుకు గాను జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలను అందజేయడంతో పాటు అంతర్జాతీయ ఫొటో ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టీవీఎస్ ఆంజనేయులు, జిల్లా కో–ఆర్డినేటర్లు బెవర నాగేశ్వరరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ముసునూరు: చింతలవల్లిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకున్నారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం ఎస్ఎస్‌పీ కెనాల్ సమీపంలో పేకాట శిబిరంపై దాడిచేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ రమాదేవికి ఘన నివాళి



జూపూడి(ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ మాజీ సర్పంచ్ అవుటి రమాదేవి ఈ నెల 16న అనారోగ్యంతో మృతి చెందింది. రమాదేవి సాక్షి రిపోర్టర్ అవుటి బాబు సతీమణి. ఈ సందర్భంగా కీలేశపురం గ్రామంలో ఆదరణ కూడిక ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జర్నలిస్టులు పాల్గొని రమాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని 53వ డివిజన్‌లోని ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. సుమారు రూ.4.70 లక్షలతో చేపట్టిన ఈ పనులను స్థానిక కార్పొరేటర్ అప్పాజీరావు ప్రారంభించారు. డివిజన్‌లోని సుబ్బరామయ్య వీధి, డ్రెయిన్ వీధుల్లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలోని పూడిక తీత పనులను నిర్వహిస్తున్నారు. ప్రతి వర్షాకాలానికి ముందు ఈ పూడిక తీత పనులను చేపడతారు. ఈ సందర్భంగా అప్పాజీరావు మాట్లాడుతూ.. స్థానిక ప్రజానీకం చెత్త, చెదరాలను డ్రెయిన్లలో వేయకుండా సిబ్బందికి అందజేయాలన్నారు. కాలువల్లో చెత్త వేయటం వలన మురుగునీటి పారుదల సాఫీగా సాగదని చెప్పారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పండూరుకు చెందిన నృత్యాంజలి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై హరిలోకేష్ శర్మ శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఎంతో ఆసక్తితో నృత్య ప్రదర్శనను వీక్షించారు. అనంతరం నృత్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఉందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ కోటా కల్యాణ్ చక్రవర్తి అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగంతో కలిసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా యువతతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఉత్తేజాన్ని కలిగించిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

- డిసెంబర్, జనవరిలో పంపిణీకి చర్యలు
- జిల్లా సమగ్రశిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ భాస్కరరావు
- ఉపకరణాల ఎంపిక శిబిరానికి విశేష స్పందన



శిబిరానికి వచ్చిన వారి పేర్లు రిజిస్టర్ చేసుకుంటున్న సిబ్బంది



దివ్యాంగులను పరీక్షిస్తున్న నిపుణులు

నూజివీడు: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల ఎంపిక కోసం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో శనివారం శిబిరాన్ని నిర్వహించారు. ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన దివ్యాంగులకు అవసరమైన ఉప కరణాలను ఎంపిక చేసిన వారికి వచ్చే డిసెంబర్, జనవరిలోగా ఉచితంగా అందజేయనున్నారు. ఆర్థోకు సంబంధించి మూడు చక్రాల సైకిల్, సంకకర్రలు, వినపడని వారికి చెవిటి మెషీన్లు, కంటి చూపు సరిగా లేనివారికి కళ్లజోళ్లు తదితర ఉపకరణాలను ఉచితంగా అందజేయనున్నారు. ఈ శిబిరానికి నూజివీడు పట్టణంతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరై సంబంధిత వైద్యులతో పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్రశిక్ష ఐఈ కో–ఆర్డినేటర్ బి. భాస్కరరావు మాట్లాడుతూ దివ్యాంగులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ భవిత కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా బోధన చేస్తారని చెప్పారు. వారంలో ఒకరోజు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ శిబిరాలను కూడా నిర్వహిస్తారన్నారు. ఏ పాఠశాలలో చేరిన దివ్యాంగులైనా ఈ కేంద్రాలకు వచ్చి ఫిజియోథెరపీ చేయించుకోవచ్చన్నారు. దివ్యాంగుల పేర్లు ఆయా పాఠశాలల యూడైస్‌లో నమోదు చేస్తే ప్రభుత్వ పరంగా వచ్చే సదుపాయాలన్నీ వర్తిస్తాయని చెప్పారు. శిబిరానికి మానసిక దివ్యాంగులు 35 మంది, అంగవైకల్యం ఉన్న వారు 43 మంది, వినికిడి వైకల్యం కలిగిన వారు 37 మంది, అంధత్వం ఉన్న వారు 20 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.సేవియా, జమలయ్య, ఆరో వార్డు కౌన్సిలర్ కందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ పెంపునకు ఎన్‌సీసీ దోహదం



గన్ షూటింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మైలవరం: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, మంచి నడవడిక అలవడతాయని కల్నల్ తీర్థప్రసాద్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ సీనియర్, జూనియర్ విభాగాలలో క్యాడెట్స్‌కు పది రోజులుగా నిర్వహించిన ఏటీసీ క్యాంప్ శనివారం ముగిసింది.

క్యాంప్‌లో విద్యార్థినులకు డ్రిల్, కల్చరల్ ప్రోగ్రామ్స్, గేమ్స్, గెస్ట్ లెక్చర్, ఫైరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ విద్యార్థినులకు గన్ షూటింగ్‌పై 188 మందికి మైలవరం సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. క్యాంప్‌నకు ఎన్‌సీసీ సీఓ కల్నల్ బలందర్ సింగ్, డెప్యూటీ సీఓ తీర్థ్ ప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కల్నల్ తీర్థ్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తద్వారా పొందే ఉపయోగాలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, సుబేదార్ మేజ్‌పాల్, ఎన్‌సీసీ ఐ–స్టాఫ్ జీసీఐ (గరల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్స్), వివిధ కళాశాలల ఏఎన్‌ఓలు, కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆర్. పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వీరాంజనేయస్వామి సన్నిధికి



కాలినడకన ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న భక్తులు

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి ఆలయం వరకు శనివారం భక్తులు పాదయాత్ర నిర్వహించారు. స్వామి జెండాలను చేబూని 140 మంది భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ స్వామిని స్మరిస్తూ ఆరు కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి కాలినడకన చేరుకున్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. 108 పాదయాత్రల్లో భాగంగా 12వ పర్యాయం పౌర్ణమి సందర్భంగా కాలినడకన వీరాంజనేయస్వామి ఆలయానికి వెళ్లామని ఆంజేయస్వామి భక్తమండలి సభ్యులు తెలిపారు.

తాత్కాలికంగా మాంసం దుకాణాలు బంద్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు పట్టణంలోని చేపలు, మాంసం, చికెన్ షాపులను తాత్కాలికంగా మూసివేసేలా ఆదేశాలు జారీచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో తోపుడు బండ్లను కూడా పెట్టవద్దని ఆదేశించారు. డయేరియా కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్.రమేష్‌బాబు జగ్గయ్యపేటలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించారన్నారు. తనిఖీల్లో భాగంగా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు జగ్గయ్యపేట పట్టణంలోని రోడ్డు మార్జిన్లలో తోపుడు బండ్లపై, మార్కెట్లలో ఉండే హోటళ్లు, జ్యూస్ పాయింట్లు, పానీపూరి, చికెన్, మటన్, చేపల మార్కెట్లలో అమ్మకాలను నిలిపివేయాలని కమిషనర్ ఆదేశించారు. డ్రైనేజీలకు సమీపంలో ఆర్‌వో ప్లాంట్లను నిర్వహించేవారు వాటర్ క్యాన్‌లను బ్లీచింగ్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరచిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ నిబంధనలు అమలు చేయనిచో వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్‌లను పబ్లిక్ హెల్త్ విభాగం అధికారి ఎస్.శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ డి.భూషణం తనిఖీ చేశారన్నారు. మురుగు కాల్వలకు దగ్గరగా ఉన్న వాటర్‌ట్యాంక్‌ల నుంచి నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశామని కమిషనర్ వివరించారు.

ప్రకటన

[illegible]

ప్రకటన

[illegible]

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు,

99122 20544 (నూజివీడు)

90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com